


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కొన్ని కులాసా కబుర్లు..!

## సాహితీ సదస్సు

అనగనగా ఓ వంగూరి చిట్టెన్‌రాజుగారు. ఆయనకి ఓ రాణీ, ముగ్గురు పిల్లలు. పెద్ద మనసూ, భూదేవంత సహనం, ఉదార హృదయం. కానీ ఒకే ఒక వ్యసనం. రాయడం. రాసేవాళ్ళతో రాసుకు పూసుకు తిరగడం. ఇది ఆయనకే పరిమితం చేసుకుంటే బాధ లేదు! పెన్నుతో బరబరా రుద్దితే పోతుందీ దురద అనుకోవచ్చు. రాసేవాళ్ళందరినీ ఒక దగ్గర సమ్మేళనం చేసి గోక్కోమనడమే తెస్తుంది తంటా!

ఆయన 'నాటకాలు రాయడు' అనుకున్నా! ఎందుకంటే రచనలో మొదట కథలే చదివాను. ఇక్కడికొచ్చాక ఈయన వేషాలు వెయ్యడమే కాదు, ఈయన నేర్పిన వేషాలు అమెరికాలో వెయ్యని తెలుగువాడు లేడని తెలిసింది! అసలు అప్పటిదాకా మొహానికి పౌడరు కూడా అద్దుకోని వాడి చేత రంగు అద్దించడం, చాకలి పద్దు కూడా రాయని వాళ్ళ చేత రచన చేయించడం ఆయన హాబీలట! ఈయనకున్న పెద్ద దురలవాటు తన ఖర్చుల మీద భారతదేశంలో తమ కూతలేవో తాము కూసుకుంటూ పోతున్న వాళ్ళని ఇక్కడికి తెచ్చి కూయించడం! కొన్ని సార్లు అవి కోయిల కూతలైతే, కొన్నిసార్లు అవి కాకి కూతలూ, కారుకూతలూ అవుతాయి.

అతిథి దేవో భవా... అన్నారు పెద్దలు. దేవుళ్ళని భరించడం సామాన్యం కాదు. వాళ్ళకి తీర్థప్రసాదాలు కావాలి. టైం తప్పకూడదు! భక్తుడంటే దేవుడికి గొప్ప అలుసు! ఒకడు ఎప్పుడూ అబద్ధమే చెపుతాడు. అవకాశమొస్తే దొంగతనం చేస్తాడు. అవసరం లేకున్నా అన్యాయం చేస్తాడు. నోరు తెరిస్తే తనని పొగుడుతుంటాడు. పక్కవాడిని తెగ తిడతాడు. పక్కవాడి శీలాన్ని నిర్దాక్షిణ్యంగా బాకు పెట్టి పొడిచి చంపగలడు.... వాడికి అష్ట ఐశ్వర్యాలూ ఉంటాయి. వాడి ధాటికి భయపడి అందరూ ఒంగి దణ్ణం పెట్టి పక్కకి తప్పుకుంటారు.

ఇంకోడు... సత్యం తప్ప పలకడు. ఆకలంటే ఎవడికైనా తన నోటి దగ్గరది తీసిచ్చేస్తాడు. అప్పు చేసైనా అవతలి వాడి ప్రాణం కాపాడతాడు. కానీ జేబులో కాణీ లేక బాధపడుతుంటాడు. నానా కష్టాలూ పడుతుంటాడు. అష్టదరిద్రాలతో కాపురం చేస్తుంటాడు. ఎందుకంటే వాడు భక్తుడు.

భక్తుడి సహనాన్ని భగవంతుడు పరీక్షిస్తుంటాడు. మొదటివాడిని ఎందుకు దండించవు? అంటే వాడు నా భక్తుడు కాదు... 'పాహిమాం' అనలేదు. అవతలి క్లాసు వాడిని ఇవతలి క్లాసు టీచర్ ఏం చెయ్యగలడు? అంటాడు భగవంతుడు. చివరాఖర్న వాడు నరకానికి పోతాడు. వీడు స్వర్గానికి పోతాడు. అదీ బొందితో... చిన్నప్పటినుంచీ నేర్చుకున్న కథలివి.

సో... ఆ బొందితో స్వర్గానికి పోడానికి ఇహలోకంలో ఎందరో రాక్షసులతో పోరాడి, ఎందరో భూలోక దేవతల్ని సంతుష్టి చేసి నానా తంటాలూ పడాలి! ఎందుకు చెప్పానంటే... పరాయి దేశం వచ్చే అతిథి దేవుళ్ళ గురించి చెపుతూ....

ఆయన ఇంటికి ఎంతో మంది అతిథి దేవుళ్ళొచ్చారు. రకరకాల వరాలిచ్చారు. 'చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంతా...' అన్నారు పెద్దలు. ఈయన స్వంత ఖర్చులు మీద తెచ్చుకుని నెత్తిన పెట్టుకుని దేవుళ్ళ మంగళ హారతులు అందుకుంటుంటారు.

నాకు ఈయనతో పెద్దగా పరిచయం లేదు. వంగూరి ఫౌండేషన్ పేరు విన్నాను. రచన(మాసపత్రిక)లో 'అమెరికాలక్షేపం', అమెరికామెడీ' చదివి పాపం 'కా' అక్షరం మింగేసారు అనుకున్నా. ఆ 'కా' వెనక చాలా కథే ఉందని ఇక్కడికొచ్చాకా తెలిసింది. ఈయనకి 'కాకా' అంటే తెలీదుట! అందుకే ఒక 'కా'తో సరిపెట్టారుట. అంతే కాదు ఈయనకి 'కాకు'లంటే ఇష్టం. ఎందుకంటే ఆయన ఊరి పేర్లో ఆ పక్షి ఉంది. ఆయన చాలా స్టైలుగా మాట్లాడతారు, కాకినాడింగ్లీషులో. ఇంగ్లీషు మాట్లాడితే 'హ్యూస్టన్'లో ఉన్నట్లూ తెలుగు మాట్లాడితే కాకినాడ మూడు లైట్ల వీధిలో ఉన్నట్లూ ఉంటుంది. మాటలు ఫెటీల్న కడుపులు పేలుస్తాయి. ఆయన కబుర్లు కడుపులు నింపుతాయి. తెగ నవ్విస్తారూ, కదిలిస్తారూ... ఆయన మాత్రం ఏమీ తినరు.

కిరణ్‌ప్రభగారి సారధ్యంలో నా అమెరికా యాత్ర అధ్యాయం ప్రారంభం అయింది. చిట్టెన్‌రాజుగారికి హైదరాబాదులో బలభద్రపాత్రుని రమణి అనే ప్రాణికి 'పెన్ను'తో పరిచయం ఉందని ఊదారు. ఆయన ఒక చల్లని రాత్రి వేళ నాకు ఫోన్ చేసారు. అప్పటిదాకా నాకీ దేశంలో కాలు పెట్టాలన్న ఊహ కూడా లేదు! 'వెళ్ళండి.. వెళ్ళండి వీసా తెచ్చుకోండి... పెట్టె సర్దుకోండి' అంటూ తెగ కంగారు పెట్టారు. నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు.

అమెరికాలో ఉన్న చుట్టాల చిట్టాలు తిరగేసాను. పేరు పేరునా వాళ్ళకి ఏం కావాలో తెలుసుకున్నాను... నాకేం కావాలో రాసుకున్నాను. కొన్నాళ్ళు నా కొట్టు కట్టేసి, కొట్లన్నీ తిరిగి పెట్టె పట్టనన్ని పట్టుచీరలు కొన్నాను. వీసా కెళితే 'ఫలానా రాజుగారు పిలుస్తున్నారా? అయ్యో ఎంత మాటా... వెళ్ళండమ్మా!' అని పదేళ్ళకి నా మొహాన పడేసారు.

రాజుగారు ఓ పని చెయ్యరు కదా! (అ) ఆరవ తెలుగు అంతర్జాతీయ మహాసభలు కాలిఫోర్నియాలో అని రచన(మాసపత్రిక)లో శ్రీ గొల్లపూడి మారుతీరావుగారి పేరూ, నా పేరూ, గౌరవ అతిథి, ప్రారంభోపన్యాసకురాలూ అని అచ్చొత్తించారు! దాంతో నాకు బోలెడు ఫోన్ కాల్స్... 'ఆవకాయా, గోంగోరా' మావాళ్ళకి తీసుకెళ్ళండి' అంటూ...

నేను మా అక్కయ్య కూతురి పురుడూ, మేనత్త కొడుకు గృహప్రవేశం, మేనమామ కొడుకుతో ప్రపంచ వింత 'గ్రాండ్ కెనియన్'; ట్రిప్ అన్నీ ప్లాన్ చేసాను. ఒక శుభముహూర్తాన బయలుదేరాను. ఒక పెద్ద మనిషి 'సూట్‌కేస్ జాగ్రత్త...పోతుంది' అన్నాడు బయలుదేరుతుంటే. మొదటిది బావుంది... రెండోది ఎందుకూ? తథాస్తు దేవతలు పనీపాటా లేకుండా పైన తిరుగుతుంటారు కదా!

చిట్టెన్‌రాజుగారిని న్యూజెర్సీలో మొదటిసారి చూసాను. హాస్యానికి ఫ్యాంటూ షర్టూ వేసినట్లున్నారు! "అమ్మలూ..." అంటూ ఆత్మీయంగా పలకరించారు. 'మీ చుట్టాలతో బాటు మన సాహితీ సదస్సు కూడా దృష్టిలో పెట్టుకో' అంటూ నన్ను హెచ్చరిస్తూనే ఉన్నారు. నేను డల్లాస్‌లో ప్రసంగించినప్పుడు నన్ను తెగ మెచ్చేసుకున్నారు. చిన్నపిల్లాడిలా సంబరపడిపోయారు.

నా సూట్‌కేస్ పోయినప్పుడు తెగ విచారించారు! అన్నింటికీ తనే కారణం అనేసుకుంటారు పాపం పిచ్చిమారాజు. ఆయన్ని చూస్తుంటే సాహితీ సదస్సులు నిర్వహించాలంటే ఎంత ఓర్పు ఉండాలో అర్థం అవుతోంది!

కాలిఫోర్నియా లోని ఫ్రీమాంట్‌లో 19, 20 వ తారీఖులలో సాహితీసదస్సులు నిర్వహించారు. ఎటు చూసినా పట్టు చీరలు, ఇడ్లీ వడా సాంబార్ ఘుమఘుమలు. తెలుగువాళ్ళకి ఇష్టమైనవి రెండు, ఒకటి కాఫీ, రెండు కాఫీ. ఇక్కడ రెండోది లేదు. మొదటిది హాయిగా దొరికింది. నన్ను ప్రారంభోపన్యాసం చెయ్యమన్నారు. ఆ ముందు రోజు వరకూ సూట్‌కేస్ రాలేదు మిస్ అయింది. మనసంతా 'ఆవు వ్యాసంలో' ఏది మాట్లాడినా సూట్‌కేస్ మీదకే వెళ్ళేట్లుంది. తీరా దొరికిందని కబురొచ్చింది. దాంతో ఆనందంగా ఉత్సాహంగా

మాట్లాడేసా! విన్న వాళ్ళకి అవి రెండూ కలిగాయో లేదో వాళ్ళే చెప్పాలి. చిట్టెన్ రాజుగారి గురించి నాలుగు మాటలు, లేనివేం కావు, వున్నవే మాట్లాడాలని చూసా... ససేమిరా ఒప్పుకోనన్నారు! కొత్తిమీర.. మీరు ఒప్పుకునేదేమిటి కౌముదిలో రాసేస్తా అనుకున్నా...

గొల్లపూడి మారుతీరావుగారి 'అమ్మ కడుపు చల్లగా' ఆవిష్కరించారు. అమ్మలూ, అయ్యలూ అంతా సంతోషించారు. ఆయన మహానుభావులు ఎందరో మహానుభావులతో కలిసి తిరిగిన వారు, పనిచేసినవారు. ఆయన సాహితీ సంపదలో నుండీ కొన్ని రతనాలని ఏరి అందరికీ పంచారు.

వింజమూరి సీతా, అనసూయా అంటే 'మొక్కజొన్న తోటలో' గుర్తుకి రాక మానదు. ఆ సిస్టర్స్‌లో ఒకరైన అనసూయ గారి పుస్తకం ఆవిష్కరించారు. ఆవిడ దేవులపల్లి వారి మేనకోడలు. అలనాటి గీతాల్ని గతాల్ని నెమరువేసుకున్నాం.

కిరణ్‌ప్రభగారు సమన్వయ కర్తగా గొల్లపూడివారూ, నేనూ, వడ్డేపల్లి కృష్ణగారూ సినిమా, టీ.వీ, సెన్సార్‌బోర్డ్‌ల గురించి ప్రసంగాలు చేసాం. ప్రేక్షకులు ఉత్సాహంగా ప్రశ్నోత్తరాలులో పాలు పంచుకున్నారు. ధారావాహికల్లో రచయిత పడే కష్టాల కింద '360' వ ఎపిసోడ్‌లో కోడలికి కాకుండా అత్త పాత్రధారికి కడుపొస్తే మా పరిస్థితి ఏమిటో నేను చెపుతుంటే తెగ నవ్వారు. తెర వెనుక మేం పడిన కష్టాలన్నీ ఇక్కడ ఏకరువు పెడితే వీళ్ళు వినోదించారు! అమెరికాలో ఉన్న మెరికల్లాంటి రచయితలు కవితలు చదివారు, పాటలు పాడారు. అరిపిరాల సువర్ణగారు 'మసికాగు'ని సభకి తెస్తే, పెమ్మరాజు లక్ష్మిగారు 'రాచిప్ప'ని మోసుకొచ్చారు.

నేనెప్పుడో రాసిన 'నేను సైతం' కథని మధ్యలో ఆపి ముగింపు రాయమని పోటీ పెట్టారు. పద్యం అంటే తెలీని వాళ్ళకి పద్యం రాయడం నేర్పించి మరీ పోటీ పెట్టారు.

అప్పటిదాకా పెన్ను పట్టని వీరులూ, వీరవనితలూ, దీక్షగా, పదోక్లాసు పబ్లిక్ పరీక్ష రాసినట్లు కథ అక్కడే పూర్తి చెయ్యడం చూస్తుంటే ముచ్చటేసింది.

'చవితి చేసుకున్న అమ్మా భోంచెయ్యమని' నన్నే కథకి ముగింపు ఎంపిక చెయ్యమన్నారు. మూడు కథలు ఎంపిక చేసాను. అప్పుడు వాళ్ళెవరో నాకు తెలీదు! తర్వాత తెలిసింది మొదటి బహుమతి పద్మావతి  పరకాల... రెండవది సత్యభామా పప్పు, మూడవది ఘుండికోట విశ్వనాథం గార్లట! ఎందుకు వాళ్ళని ఎంపిక చెయ్యాల్సొచ్చిందో నా వాదన నేను వినిపించాను. జనం (ప్రైజులు రానివాళ్ళు) మూతులు తిప్పలేదు! ఆశ్చర్యంగా చేతులు నొప్పెటట్లు చప్పట్లు కొట్టారు.

ఎవరో చివరి రోజున 'చల్లని కాఫీ తాగించారన్నారు' అంత చల్లని సాహితీ సౌరభాలు వీస్తున్న సభలో ఎంత వేడి అయినా చల్లగానే ఉంటుంది!

పసివాడెవరో పాట పాడాడు. సత్యభామ సినిమా సాహిత్యం గురించి చెపుతూ తియ్యగా పాడి అలరించింది. ప్రవాసాంధ్రులు ఎంతో మంది వచ్చారు. విజయ్‌బాబుగారొచ్చి జర్నలిజంలో హాస్యం గురించి మాట్లాడారు. మందపాటి సత్యంగారు ఇక్కడ వారి రాతల్నీ, ప్రచురణల్నీ ఏకరువు పెట్టారు. మధుబాబుగారు 'నిశ్శబ్దం' అంటూ అందమైన శబ్దాలతో, భావాలతో మైమరిపించే కవిత చదివారు. మృత్యంజయుడుగారు 'మృత్యువు' గురించి భారతంలో ఘట్టాల్ని వివరించారు. ఇంకా చాలా మంది చాలా చేసారు. వచ్చిన ప్రతివాళ్ళూ స్టేజ్ ఎక్కారంటే అతిశయోక్తి కాదు! పలకరింపులూ, పలహారాలూ, చర్చలూ, చణుకులతో రెండు రోజులూ సందడిగా ఒక పండగలా గడిచింది. ఆఖరిగా పెమ్మరాజు వేణుగోపాలరావుగారు జరిగినదంతా సమీక్షించారు. ఎన్ని అందమైన క్షణాలు దొర్లిపోయాయో అందరికీ అర్థమైంది. వీడ్కోలు సభలో నిజంగా ఎడబాటుకి సాహితీ ప్రియులు భారమైన మనస్సులతో వెనుదిరగడం మొదటిసారి చూసాను!

People cannot know when they are making a memory…అంతా నిశ్శబ్దంగా జరిగిపోతుంది. కానీ స్మృతుల్లో శాశ్వతంగా ఉండిపోతాయి!

ఈ ఆనందానికి కారణమైన సూత్రధారి వంగూరి చిట్టెన్‌రాజుగారు మధ్య మధ్యలో వచ్చి తనదైన శైలిలో చక్కలిగింతలు పెడుతూనే ఉన్నారు. అంతా జరిగిపోయాకా 'నాకేం తెలీదన్నట్లు' అతి నెమ్మదిగా నిష్క్రమించారు. ఆయనకే 'దుశ్శాలవలూ' ఎవరూ కప్పలేదు! మైకులు అదిరేలా 'బాకా'లు ఊదలేదు! దీని వెనుక ఎంత కష్టం ఉందో.. ఎంత 'అర్థం' ఖర్చయిందో... ఆ మహారాజుకే తెలియాలి

భారత దేశంలో నుండీ మమ్మల్ని తీసుకొచ్చి, ఇంత శ్రమ పడి, సంగీత సాహిత్యాలతో జతపడి, సాహిత్యానికి పెద్దపీట వెయ్యని వాళ్ళ మీద తిరగబడి... ఇన్నిసార్లు పడి పడి ఈ సభలు చేస్తే మీకేం ఒరిగిందయ్యా? అంటే... ఆయన చిరునవ్వుతో నవ్వుతారు! ఆయన కళ్ళల్లో అనంతమైన సంతృప్తి!

దాన్ని దేనితో వెల కట్టగలం?

ఎందరో మహానుభావులు...

అందులో మా చిట్టెన్‌రాజుగారు ఒకరు!

ఆయనకి నా వందనాలు!

✷✷✷

